


సోమశిల గ్రామానికి జాతీయ పర్యాటక అవార్డు

- రేపు ఢిల్లీలో అందుకోనున్న జిల్లా టూరిజం శాఖ అధికారి



సోమశిల దగ్గర కృష్ణానది తీరం

కొల్లాపూర్, సెప్టెంబరు 25: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామం పర్యాటక రంగంలో జాతీయ అవార్డుకు ఎంపికైంది. పురాతన ప్రాచీన ఆలయాలు, ఏరులై పారుతూ సముద్రాన్ని తలపించే కృష్ణానది సోయగాలు, నల్లమల అటవీ అందాలతో పర్యాటకానికి ప్రసిద్ధి గాంచడంతో సోమశిలకు ఈ అవార్డు దక్కింది. ఈ నెల 27వ తేదీన ఢిల్లీలోని విద్యాభవన్‌లో జాతీయ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి కల్వరాల నరసింహ, సోమశిల గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ శర్మలు అవార్డును అందుకోనున్నారు. జాతీయ అవార్డుకు సోమశిల గ్రామం ఎంపిక కావడంతో పర్యాటకంగా మరింత అభివృద్ధి కానుంది.



సోమశిల గ్రామంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు ఉన్న లలితాంబిక సోమేశ్వరాలయం

ప్రాజెక్టులే ప్రాధాన్యం

- ఫాస్ట్రాక్ పద్ధతిలో పనుల పూర్తికి సిద్ధం
- మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు
- ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల పరిశీలన
- ఉదండాపూర్, గట్టు, శంకరసముద్రం, నార్లాపూర్ రిజర్వాయర్ల వద్ద సమావేశాలు
- ప్రాజెక్టుల సత్వర పూర్తికి నివేదికలకు ఆదేశం
- పాలమూరు- రంగారెడ్డి ద్వారా 12 లక్షల ఎకరాలకు నీరిస్తామని ప్రకటన



ఉదండాపూర్ వద్ద నిర్వాసితుల నుంచి వినతి పత్రాలు తీసుకుంటున్న ఎంపీ మల్లు రవి



గట్టు రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి; చిత్రంలో మంత్రి జూపల్లి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల కలెక్టర్ సంతోష్

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులను నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ, ఎమ్మెల్యేలతో బుధవారం పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించి, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న పాలమూరు- రంగారెడ్డి సహా కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలకు సంబంధించి పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత స్థితి, కావాల్సిన నిధులు, టైం ఫ్రేం కోసం మంత్రులు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ఆయా ప్రాజెక్టులను సందర్శించారు. మొదట ఉదండాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. అక్కడ రూ.12.90 కోట్లతో నిర్మించనున్న రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు పూర్తికి ప్రధాన అడ్డంకిగా ఉన్న ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి ఒక్కో కుటుంబానికి రూ.16.30 లక్షల చొప్పున రూ.45 కోట్లు మొదటి విడతగా విడుదల చేశారని, ఇంకా రూ.800 కోట్ల వరకు అవసరం అవుతాయని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతానికి రిజర్వాయర్ అత్యంత అవసరం కాబట్టి, అంతే ప్రాధాన్యంగా భూములు ఇచ్చిన రైతులు, నిర్వాసితులకు డబ్బులు విడుదల చేయాలని కోరారు. గతంలో రూ.ఏడు లక్షల కోట్ల అప్పు చేసిన ప్రభుత్వం నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వలేదని, ఇప్పుడు తాము నిధులు విడుదల చేస్తున్నామని మంత్రులు తెలిపారు. ఉదండాపూర్‌ను త్వరితగతిన పూర్తి చేస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సమావేశం ముగిసిన తర్వాత కొంతమంది నిర్వాసితులు తమకు రూ.25 లక్షల ప్యాకేజీ కావాలని, ఎకరాకు రూ.12.50 లక్షలు ఇవ్వాలని నిరసన తెలిపారు. ఎంపీ మల్లు రవి వారి నుంచి వినతి పత్రం తీసుకుని ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

ఆర్డీఎస్ సమస్యను పరిష్కరిస్తాం

ఉదండాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించిన తర్వాత మంత్రులు హెలికాప్టర్‌లో జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు మండలానికి చేరుకుని, అక్కడి రిజర్వాయర్‌ను పరిశీలించారు. పెంపు ప్రతిపాదనలు, దానికి సంబంధించిన రిపోర్టులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో అంతర్రాష్ట్ర ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై పూర్తిగా నిర్ణయం తీసుకుంటామని ఉత్తమ్ తెలిపారు. ర్యాలంపాడు లీకేజీల కట్టడి, ఆర్డీఎస్ సమస్యను పరిష్కరిస్తామని, మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అక్కడి నుంచి వనపర్తి జిల్లాలోని రాజీవ్‌భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన శంకరసముద్రం రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఆర్‌అండ్‌ఆర్ సమస్య, పునరావాస కాలనీ, నిధులు ఎంత అవసరం? అనేది వారం రోజుల్లో నివేదిక ఇస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు.

అదే లక్ష్యం

వనపర్తి జిల్లా శంకర సముద్రం రిజర్వాయర్‌ను పరిశీలించిన అనంతరం మంత్రులు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని పీఆర్‌ఎల్‌ఐలో అంతర్భాగంగా నిర్మించిన నార్లాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఫాస్ట్రాక్ పద్ధతిలో పనులు పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతీ నెలా సమావేశాలు నిర్వహించుకుని.. ఆర్థిక, సాగునీటి శాఖ సమన్వయంతో పనిచేస్తామని ప్రకటించారు. పాలమూరు-రంగారెడ్డి ద్వారా 12 లక్షల ఎకరాలకు నీరివ్వడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. పర్యటనలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఇరిగేషన్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ మురళీధర్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పూర్తి చేస్తాం



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్

నాగర్‌కర్నూల్,(ఆంధ్రజ్యోతి): పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను ఫాస్ట్‌ట్రాక్ ప్రాతిపదికన పూర్తి చేస్తామని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన కేసీఆర్ పాలమూరు జిల్లాకు ఒరుగబెట్టిందేమీ లేదని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, నిబద్ధతతను నిరూపించుకోవడంతోపాటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా బుధవారం కొల్లాపూర్ మండలంలోని పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం హెడ్ వర్క్స్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు కేఎల్‌ఐ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం గురించి అధికారులతో సమగ్రంగా చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ముందుకెళ్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల పేరిట దోపిడీ కొనసాగించిందని అన్నారు. రూ.వేల కోట్లు ఖర్చు పెట్టి, నామమాత్రపు పనులతో ప్రజాధనాన్ని లూటీ చేశారని ఉత్తమ్ దుయ్యబట్టారు. ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. సమావేశంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, అనిరుధ్‌రెడ్డి, విజయుడు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణపాటిల్, ఇరిగేషన్ ఏఎన్‌సీ అనిల్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్ఈ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్

ఉపాధ్యాయులు మేధావి వర్గం

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్

వనపర్తి అర్బన్, సెప్టెంబరు 25 : ఉపాధ్యాయులు విద్యార్థులకే కాదు సమాజానికి కూడా మేధావి వర్గమని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కాంటెంపరరీ గ్లోబల్ ట్రెండ్స్ రోల్ ఆఫ్ సోషల్ టీచర్స్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము చదువుకునేటప్పటికీ ఇప్పటికీ సోషల్ స్టడీస్ చాలా మారిందన్నారు. ఈ మధ్యనే సోషల్ స్టడీస్ బుక్కులను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఏదైనా ఒక విషయాన్ని విషయంగా చూడకుండా పాఠంగా చూడాలని అప్పుడే తరగతి గదిలో విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఒకప్పుడు ఏదైనా ఒక విషయం విద్యార్థులకు తెలిసిన తరువాతనే వారు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెబితేనే వారికి తెలిసేది అన్నారు. కానీ, మారుతున్న సమాజంలో సోషల్ మీడియా వలన ప్రతీ ఒక్కరికి బయట జరుగుతున్న పరిణామాలు క్షణాల్లో తెలిసిపోతున్నాయన్నారు. పిల్లలకు ప్రతీ సబ్జెక్టు బోధించే ముందు సమాజంలో జరుగుతున్నటువంటి అంశాలపై కూడా వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బయటి ప్రపంచంలో జరుగుతున్న విషయాలపై కూడా ఉపాధ్యాయులు ప్రతినిత్యం విద్యార్థులకు చెప్పాలన్నారు. ఉదాహరణకు పాలస్తీనా, ఇజ్రాయిల్ వివాదం గురించి మన దేశంలో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగిందని, బయట దేశంలో జరిగిన దాని గురించి తరగతి గదిలో విద్యార్థులు అడిగితే టీచర్లు క్లాస్ రూపంలో చెప్పాలని సూచించారు. ఇలాంటి విషయాలపై విద్యార్థులకు పూర్తిగా అవగాహన ఉండేలా బోధించాలన్నారు. జమ్ము కశ్మీర్, బంగ్లాదేశ్, ఇండియా-పాకిస్తాన్, ఇండియా-చైనా, రష్యా-అమెరికా దేశాల సత్సంబంధాల గురించి ఆయన విశ్లేషించారు. స్వాతంత్ర్యం సంపాదించడానికి చేసిన పోరాటం, మనుషుల పట్ల విశ్వాసం, సంప్రదాయం, కులం, మతం వేరు చేసే అంశాల గురించి, విచ్ఛిన్నత, మనుషులను అవమానించడం, తక్కువగా చేసి చూడడం వంటి అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా భారతీయ, తెలంగాణ, గ్రామ సమాజం, అర్బన్ కమ్యూనిటీ వంటి సమాజాలపై కూడా ఉపాధ్యాయులకు ఒక అవగాహన అవసరమన్నారు. మానవ సంబంధాలు, ఆర్థిక సంబంధాలు, అంతర్జాతీయ సంబంధిత అంశాలపై కూడా సోషల్ స్టడీస్‌కు సంబంధించిన అంశాలు అని ప్రతీ ఉపాధ్యాయుడు కూడా అప్‌డేట్‌గా ఉండి విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రస్తుతం పిల్లలకు ఉపయోగపడే సంపదను మనమే వాడేస్తున్నామని, వనరుల వినియోగంపై కూడా అవగాహన కల్పించాలన్నారు. స్వార్థం అనేది ఒక సామాజిక విలువ అని, సమాజ నిర్మాణం, ప్రస్తుతం జరుగుతున్న సామాజిక హింసపై చాలా మంది అడుగుతుంటారని, దీనిపై సమాజంలో వివరణ ఇచ్చేది ఉపాధ్యాయులే అని గుర్తు చేశారు. ఇలా ప్రతీ అంశంపైన జాతీయ సమైక్యత, జాతీయ విలువలు, వనరుల వినియోగం, శాస్త్రీయ విధానం, సెక్యులరిజం, విదేశీ విధానం వంటి అంశాలపై విపులంగా వివరించారు.

అనంతరం పలువురు ఉపాధ్యాయులు అడిగిన అంశాలపై క్లుప్తంగా వివరించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రతంగ్ పాండురెడ్డి మాట్లాడుతూ.. మంచి విలువలు గల పౌర సమాజ నిర్మాణంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని తెలిపారు. జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ యుగంధర్ మాట్లాడుతూ ప్రశస్త యాప్ ద్వారా విద్యార్థుల ప్రతిభను మానిటరింగ్ చేస్తూ, ఫలితాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భగవంతు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎంఈవో లు శ్రీనివాస్ గౌడ్, జయశంకర్, జయరాం, ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, విజయలక్ష్మి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతీ పీహెచ్‌సీ నుంచి రూ.20 వేలు ఇవ్వండి

- ఆడిట్ అధికారులకు ఇవ్వాలి
- పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ఫోన్
- ఏడాదిగా బడ్జెట్ లేదు మేమెలా ఇవ్వాలని ఆవేదన
- ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ బడ్జెట్‌ను దారిమళ్లించే యత్నం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) సెప్టెంబరు 25: మహబూబ్‌నగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులు అవినీతికి తెరలేపారు. ఆడిట్ అధికారుల పేరు చెప్పి మెడికల్ ఆఫీసర్ల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు పూనుకున్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో ఆడిట్ కొనసాగుతున్న నేపథ్యంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు ఫోన్ చేసి ఒక్కో అధికారి రూ. 20 వేలు ఇవ్వాలని అడుగుతున్నట్లు తెలుస్తోంది. లేదంటే ఆడిట్ అధికారులు కొర్రీలు పెట్టే అవకాశం ఉందని భయపెడుతున్నట్లు సమాచారం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ప్రతీ ఐదేళ్లకోసారి జనరల్ ఆడిట్ జరుగుతుంది. గతంలో 2019 వరకు ఆడిట్ జరిగింది. ప్రస్తుతం 2019 నుంచి 2024 వరకు సంబంధించిన ఆడిట్ ఈనెల 18 నుంచి ప్రారంభమైంది. ముందుగా జిల్లాలోని 23 ప్రాథమిక, పట్టణ పీహెచ్‌సీలకు ఐదేళ్లలో మంజూరైన బడ్జెట్, వాటి ఖర్చుల వివరాలు, రికార్డులకు సంబంధించి ఆడిట్ చేశారు. అందులో కొన్ని పీహెచ్‌సీలకు వెళ్లి చేయగా, మరికొన్ని పీహెచ్‌సీల రికార్డులను తెప్పించుకొని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలోనే చేశారు. చివరి రోజు బుధవారంజిల్లా కార్యాలయానికి సంబంధించిన ఆడిట్ చేశారు.

మామూళ్లు ఇవ్వాలని..

జనరల్ ఆడిట్ జరుగుతున్న నేపథ్యంలో ఇదే అదునుగా భావించిన జిల్లా కార్యాలయంలోని కొందరు అధికారులు అవినీతికి తెరలేపారు. ఆడిట్ అధికారులకు మామూళ్లు ఇవ్వాల్సి ఉందని, అందువలన ప్రతీ పీహెచ్‌సీ నుంచి రూ.20 వేలు ఇవ్వాలని ఫోన్ చేసి చెప్పారని సమాచారం. లేదంటే కొర్రీలు పెట్టే అవకాశం ఉంటుందని మెడికల్ ఆఫీసర్లను భయభ్రాంతులకు కూడా గురిచేసినట్లు తెలిసింది. ఆడిట్ అయిపోయిన తర్వాత డబ్బులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించినట్లు సమాచారం.

మేమెలా ఇవ్వాలి

పీహెచ్‌సీలకు బడ్జెట్ రాక ఏడాది అవుతుండటంతో సొంతంగా రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు చేశామని, అవి కూడా ఇప్పటి వరకు రాలేదని మెడికల్ ఆఫీసర్లు అంటున్నారు. ఒక్కో పీహెచ్‌సీ నుంచి రూ.20 వే లు ఏ బడ్జెట్ నుంచి తీయాలని?, ఎలా సర్దుబాటు చేయాల ని తర్జనబర్జన పడుతున్నారు. కొందరు డాక్టర్లు మాత్రం మావన్నీ సక్రమంగానే ఉన్నాయని, మేమెందుకు ఇవ్వాలని నిర్భయంగా ఉన్నారు. కొందరు సగం డబ్బులు ఇచ్చినట్లు సమాచారం.

ఆ నిధులు దారి మళ్లించే ప్రయత్నం

కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లోని సబ్ సెంటర్లను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా మార్చింది. వాటికి రంగులు వేయించడంతో పాటు బ్రాండింగ్ కూడా చేయించింది. ఇందుకు సంబంధించి ఒక్కో సబ్ సెంటర్‌కు రూ.50 వేల చొప్పున నెల క్రితం నిధులు విడుదల చేసింది. ఆ బడ్జెట్‌ను పీహెచ్‌సీలకు ఇంకా వేయలేదు. అయితే ఆ నిధులు పీహెచ్‌సీలకు వేసిన తర్వాత అందులో నుంచి ఈ రూ. 20 వేలు సర్దుబాటు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

పోలీస్ డ్యూటీ మీట్

- రాష్ట్రంలో మొదటి సారి నారాయణపేటలో ఏర్పాటు
- వీటి వల్ల సామర్థ్యాలు మెరుగుపడతాయి : ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, సెప్టెంబర్ 25: నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో రాష్ట్రంలో మొదటి సారి బుధవారం పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించారు. జిల్లా పోలీస్ అధికారులకు డీసీఆర్‌బీ డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్పీ యోగేష్ గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సైంటిఫిక్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా మహిళ, పురుష మృతదేహాలను, హిట్ అండ్ రన్ యాక్సిడెంట్‌ను ఆర్టిఫిషియల్‌గా ఏర్పాటు చేసి, వాటిపై పరిశీలన చేశారు. ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా, రాత పరీక్ష, మెడికో లీగల్ టెస్ట్, ఓవరల్ టెస్టు, క్రైమ్ సీన్ ఫొటోగ్రఫీ, యాంటీ సబాటేజ్ చెక్, వెహికల్ సెర్చ్, గ్రౌండ్ సెర్చ్, కంప్యూటర్ అవేర్‌నెస్, డాగ్ స్క్వాడ్ పరిశీలన తదితర ఈవెంట్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్ వల్ల చట్టం అమలు, అంతర్గత భద్రత, నైపుణ్యాలను పెంపొందిస్తుందన్నారు. వృత్తిపరమైన పని తీరు, సామర్థ్య మెరుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్, డీఎస్పీ లింగయ్య, మహేష్, సీఐలు చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, నరసింహ, ఎస్ఐలు సునీత, భాగ్యలక్ష్మిరెడ్డి, అశోక్‌బాబు, రమేష్, కృష్ణంరాజు పాల్గొన్నారు.



క్రైం సీన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



డెడ్ బాడీని పరిశీలిస్తున్న పోలీసులు



ల్యాబ్‌లో ఆధారాలను పరిశీలిస్తున్న పోలీసులు

కూతురిని చూసేందుకు వెళ్తూ.. టిప్పర్ ఢీకొని తండ్రి మృతి



చంద్రన్న(ఫైల్)


మహబూబ్‌నగర్, సెప్టెంబరు 25 : వృద్ధుడిని టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ మండలంలోని కోడూరు స్టేజీ వద్ద జరిగింది. హనుమాన్‌పుర ఉంటున్న బోయ చంద్రయ్య(75) అదే గ్రామంలో ఉంటున్న పెద్ద కుమార్తె ఇంటి నుంచి మాచన్‌పల్లిలో ఉంటున్న తన రెండో కూతురును చూసి వచ్చేందుకు బుధవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. కోడూరు స్టేజీ వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా టిప్పర్ డ్రైవర్ అతివేగంగా నడుపుతూ నడుచుకుంటూ వెళుతున్న చంద్రయ్యను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.






బాలిక ఆత్మహత్యకు కారణమైన ముగ్గురు నిందితులపై పోక్సో కేసు

కేటీదొడ్డి, సెప్టెంబరు 25: జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ముగ్గురు యువకులు వేధింపులకు గురి చేయడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు నిందితులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బాలికను ముగ్గురు యువకులు లైంగికంగా వేధింపులకు గురిచేయడంతో ఈ నెల 12న పురుగుల మందు తాగిందని తెలిపారు. చికిత్స పొందుతూ 20వ తేదీన మృతి చెందిందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.





ప్రాథమిక వైద్యం పెంటల్లోనే..

- డీఎఫ్‌వో రోహిత్ గోపిడి
- 80 మంది బేస్ క్యాంపు వాచర్లకు ఆరోగ్య కిట్ల పంపిణీ



వాచర్లకు ఆరోగ్య కిట్‌ను అందజేస్తున్న డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

మన్ననూర్, సెప్టెంబరు25: ఎలాంటి వైద్య సదుపాయాలు లేని మారుమూల చెంచు పెంటల్లో ప్రాథమిక వైద్యం చేసుకోవాలని డీఎఫ్‌వో రోహిత్ గోపిడి సూచించారు. అపోలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో జిల్లా పరిధిలోని బేస్ క్యాంపుల్లో పనిచేసే 80 మంది వాచర్లకు ఆరోగ్య కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పెంటల్లో, అడవుల్లో ఏదేని చిన్న గాయాలైన సందర్భంలో మందులను ఎలా వాడాలో అపోలో టోటల్ హెల్త్ క్లీనిక్‌లో బేస్ క్యాంపు వాచర్లకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న బేస్ క్యాంపు వాచర్లకు ఆరోగ్య కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అపోలో హెల్త్ ఫౌండేషన్ సీఈవో రాంబాబు, మన్ననూరు రేంజ్ అధికారి దేవజ, డీఆర్‌వో రవి కుమార్ పాల్గొన్నారు. మన్ననూరు రైతువేదిక ఆవరణలో చెంచుల కోసం జన్‌మన్ ఆధార్ నమోదు శిబిరం, కులం, ఆదాయం, స్థానిక ధ్రువీకరణ పత్రాల జారీ కోసం శిబిరాలను గురువారం నుంచి మన్ననూరులో ప్రారంభించనున్నట్లు ఏఓ జాఫర్ హుస్సేన్ తెలిపారు.

ఫొటోలతో వేధించిన ఇద్దరు పోలీసుల సస్పెన్షన్

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 25 : ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సస్పెండ్ చేసినట్లు సీఐ కనకయ్య బుధవారం తెలిపారు. డబ్బులకు కక్కుర్తి పడి ఫొటోలు తీసి అబాసుపాలైన ఇద్దరు కానిస్టేబుళ్లు రామచందర్, చిన్నయ్య సస్పెండ్ అయ్యారు. మే 16వ తేదీన ఓ జంట నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నల్లవెల్లి రోడ్డులో మధ్యాహ్నం కారులో భోజనం చేస్తుండగా వారి ఫొటోలు తీసి డబ్బులు డిమాండ్ చేశారు. వారి వద్ద డబ్బులు లేకపోవడంతో రూ.2వేలు మాత్రమే ఉండగా కానిస్టేబుల్ తమ స్నేహితుడి ఫోన్‌పేలో వేయించుకున్నారు. తిరిగి ఇటీవల డబ్బుల కోసం ఆ యువకుడిని ఒత్తిడి చేయడంతో స్పందించలేదు. దీంతో బిజినేపల్లిలో ఉన్న తన తోటి కానిస్టేబుల్‌తో మాట్లాడి ఆ ఫొటోలు పంపించి యువకుడి భార్యకు చూయించడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భార్య పురుగుల మందు తాగగా, భర్త ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వారి బంధువులు వివాదంపై జరిగిన విషయాలను గుర్తించారు. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివిధ పత్రికల్లో ప్రచురితమైంది. ఈ ఘటనపై ఎస్పీ సమగ్ర విచారణ చేసి బాధ్యులైన కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు.

చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులకు అప్పగింత

మిడ్జిల్, సెప్టెంబరు 25: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన కల్యాణ్ కేబుల్‌వైర్లను సంచిలో వేసుకొని అమ్ముకునేందుకు వెళ్తుండగా, సంచి జారి కిందపడటంతో కేబుల్ వైర్లు బయటపడినట్లు రైతులు తెలిపారు. ఇన్ని వైర్లు ఎక్కడి నుంచి తెస్తున్నావని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకపోవడంతో అతన్ని పోలీసులకు పట్టించారు. అతను మద్యం మత్తులో ఉండడంతో కుటుంబసభ్యులకు అప్పగించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వైర్ల గురించి ఆరా తీస్తామని పోలీసులు తెలిపారు.







వాహనం ఢీకొని వివాహిత దుర్మరణం

- గుర్తుపట్టరాని విధంగా మారిన మృతదేహం

భూత్పూర్, సెప్టెంబరు 25 : గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వివాహిత దుర్మరణం చెందింది. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగకర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజవర్గంలోని కోడేరు మండల మాసుపల్లికి చెందిన లక్ష్మి (26) నాలుగేళ్ల క్రితం భర్త, ఇద్దరు పిల్లలను వదిలేసి ఒంటరిగా జీవిస్తుంది. అయితే జాతీయరహదారి పైన ఎందుకు వచ్చిందో తెలియదు కానీ బుధవారం తెల్లవారుజామున భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని మునిరంగస్వామి దేవాలయం ప్రాంతంలో జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్‌కు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహం గుర్తు పట్టరాకుండా రోడ్డుపై పడి ఉంది. విషయాన్ని గమనించిన ఎల్‌అంటీ పెట్రోలింగ్ అధికారి శివకుమార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గుర్తు తెలియని మహిళగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. విషయాన్ని తెలుసుకున్న బంధువులు రోడ్డు ప్రమాదంలో చనిపోయింది లక్ష్మిగా గుర్తించారు. ఎల్‌అంటీ పెట్రోలింగ్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

అప్పుల బాధతో కానిస్టేబుల్ అదృశ్యం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య

- నాలుగు బృందాలతో వెతుకుతున్నట్లు పోలీసుల వెల్లడి



రామకృష్ణ

వనపర్తి క్రైమ్, సెప్టెంబరు 25 : అప్పుల బాధతో ఓ కానిస్టేబుల్ అదృశ్యమైన ఘటన వనపర్తి జిల్లాలో చోటు చేసుకుంది. పాన్‌గల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రామకృష్ణ మంగళవారం రాత్రి 10:30 గంటల వరకు విధులు నిర్వహించాడు. ఆ తర్వాత జిల్లా కేంద్రంలోని తన ఇంటికి వెళ్లి బుధవారం తెల్లవారుజామున మూడు గంటలకు సెల్‌ఫోన్ ఇంట్లోనే పెట్టి కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్లిపోయాడు. చివరి సారి తన భార్య మంజులకు అప్పుల బాధతో ఇబ్బందులకు గురవుతున్నానని, రూ.రెండు కోట్ల వరకు అప్పు అయిందని మెసెజ్ పెట్టాడు. ఉదయం అతను కనిపించకపోవడం, సెల్‌ఫోన్ అక్కడే ఉండడంతో వెంటనే ఆ ఫోన్‌లో మెసెజ్ చూసిన భార్య వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నాగభూషణం రావు బుధవారం తెలిపారు. రామకృష్ణ ఆచూకీ కోసం నాలుగు బృందాలుగా సిబ్బంది వెతకడానికి ప్రయత్నం చేస్తున్నామని అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్ తెలిపారు. అయితే రామకృష్ణ శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఓ కానిస్టేబుల్‌తో కలిసి వనపర్తి జిల్లా కేంద్రంలో కొన్నేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడిని నమ్ముకుని దాదాపు రూ.రెండు కోట్ల వరకు పెట్టుబడి పెట్టి అప్పుల పాలై ఇబ్బందులకు గురవుతున్నాడని భార్య మంజుల ఫిర్యాదులో రాశారు. కానిస్టేబుల్ జిల్లా కేంద్రం సమీపంలో విల్లాలు నిర్మించాడు. అవి అమ్ముడు పోకపోవడంతో రూ.కోట్లలో నష్టం జరిగినట్లు సమాచారం. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కానిస్టేబుల్ కూడా శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో వినాయకుడి బందోబస్తు కోసం హైదరాబాద్‌కు వెళ్లి ఇప్పటి వరకు రాలేదని, కనీసం రిపోర్టు కూడా చేయలేదని శ్రీరంగాపూర్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేటి నుంచి ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్

-స్టేడియం మైదానంలో క్రీడా పోటీలకు ఏర్పాట్లు



స్టేడియంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 25: జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి 27వ తేదీ వరకు రీజినల్ లెవెల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ నిర్వహించనున్నారు. బుధవారం స్టేడియంలో టోర్నీ నిర్వహణకు అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్, చెస్, కబడ్డీ, బాస్కెట్ బాల్, రైఫిల్, వాలీబాల్, క్రికెట్, పలు క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని అటవీశాఖ సంబంధించిన క్రీడాకారులు పాల్గొననున్నారు. ఉదయం 9:30 గంటలకు పోటీలను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించన్నున్నట్లు జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు.

'జోగుళాంబ' బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండాసురేఖ, ఆలయ అధికారులు

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే దసరా శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానిద్దామని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులతో అన్నారు. అమ్మవారి దసరా బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆలయ ఈవో పురేందర్ కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ మంత్రిని బుధవారం ఆమె నివాసంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బ్రహ్మోత్సవాలకు జరుగుతున్న ఏర్పాట్లపై అధికారుల్ని ఆరా తీశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రసాద్ స్కీంతో నిర్మించిన నూతన భవనంలో భక్తులకు అన్నదానం, వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శక్తిపీఠం అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిద్దామని అధికారులతో మంత్రి చర్చించారు. సమయాన్ని బట్టి సీఎంతో మాట్లాడి సమయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కాగా ప్రభుత్వం తరపున మంత్రి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. కాగా ఈ సారి సామాన్య భక్తులతోపాటు ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని, అందుకు తగ్గట్లుగా మంత్రి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న సుధాకర్

పాలమూరు, సెప్టెంబరు 25 : మునిసిపల్ కార్మికులకు ఎనిమిది గంటల పనివిధానం అమలు చేయాలని తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధ వారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మునిసిపాలిటీల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, వివిధ రకాల కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు, కేటగిరీల వారీగా ప్రతీనెల ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలన్నారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారి చదువు, వృత్తి నైపుణ్యతను గుర్తించి పదోన్నతులు కల్పించాలన్నారు. రాత్రివేళ డ్యూటీ చేసే వారికి రవాణా సదుపాయం, పని ప్రదేశంలో విశ్రాంతి గదులు ఏర్పాటు చేసి, రక్షణ కల్పించాలన్నారు. అదేవిధంగా, పీఎఫ్, ఈఎస్‌ఐ డబ్బు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలన్నారు. దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలనే పలు డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కిల్లె గోపాల్, ఏ.వెంకటేష్, పి.నరసింహులు, కె.బాలరాజు, పి.విశ్వనాథం, చిన్న, ఎర్రం నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన ఉత్సవాలు

- ఆకట్టుకున్న గిరిజన నృత ప్రదర్శన

- పోటీల్లో పాల్గొన్న 400 మంది విద్యార్థులు



జానపద నృత్యంలో ప్రథమ బహుమతిని అందుకుంటున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 25: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజన ఉత్సవాలను డీవైఎస్‌వో శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక పోటీలతో యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చని అన్నారు. పోటీల్లో ప్రథమ స్థానంలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. జానపద నృత్యం (సోలో), జానపద నృత్యం (గ్రూపు), జానపద గీతం (సోలో), జానపద గీతం (గ్రూపు) వ్యాసరచన, పెయిటింగ్, ఉపన్యాసం, కవిత్వం, యువక్రాంతి అంశాల్లో పోటీలు నిర్వహించారు. అదే విధంగా సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సాంస్కృతిక పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 350 మంది విద్యార్థులు, యువత పాల్గొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, వృత్తి నైపుణ్య కేంద్రం ఇన్‌చార్జి విజయ్‌కుమార్, న్యాయ నిర్ణేతలు దాసరి రంగయ్య, సూర్యదివకార్, రవిశంకర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, కోచ్‌లు సునీల్, ఖలీల్, పర్వేజ్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది వీరే..

జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జానపద నృత్యం గ్రూప్‌లో (చంద్రముఖి కల్చరర్ అకాడమీ, మహబూబ్‌నగర్), జానపద గీతాల గ్రూప్ (సరోజినీ నాయుడు ఫార్మసీ కళాశాల, మహబూబ్‌నగర్), జానపద గీతాలు సోలో నాగ చైతన్య (చైతన్య స్కూల్, మహబూబ్‌నగర్), వ్యాసరచన నిఖిత (డైట్ కళాశాల, మహబూబ్‌నగర్), పెయింటింగ్ అస్ర తబస్సుం (డైట్ కళాశాల, మహబూబ్ నగర్), ఉపన్యాసం షబానాబేగం (ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల), సైన్స్ (శ్లోకా పాఠశాల, జడ్చర్ల) యువకాంత్రి (జెడ్పీహెచ్ఎస్ ఎదిర) రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.



గిరిజన నృత్యం చేస్తున్న విద్యార్థులు



నృత్యం చేస్తున్న యువతులు

రోడ్లు ఇలా.. వెళ్లేదెలా..?

- వరదలకు కొట్టుకుపోయిన రహదారులు

- ఇక్కట్లు పడుతున్న ప్రజలు

చారకొండ/కోడేరు, సెప్టెంబరు 25: జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిలో భాగంగా చారకొండ నుంచి మర్రిపల్లి వరకు బైపాస్ రోడ్డు పనులు చేపట్టారు. చారకొండ నుంచి మర్రిపల్లి వరకు స్థానికంగా ఉన్న ప్రధాన రహదారిపై అడుగడుగునా గజం లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఇది వరకు కాంట్రాక్టరు గుంతల మయంగా మారిన స్థానంలో కంకర మట్టి పోసి వదిలేశారు. ఈ రహదారి వెంట భారీ వాహనాల రాకపోకలకు గుంతల్లో వేసిన కంకర మట్టి కొట్టుకపోయి మరింత గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షానికి గుంతల్లో నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు రాత్రి సమయాల్లో గమ్యం చేరాలంటే జంకుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయాల్లో రోడ్డు కనిపించక గుంతల్లో పడి ఆసుపత్రుల పాలైన ఘటనలు ఉన్నాయి.

చారకొండ మండల కేంద్రంలో వాహనాల రాకపోకలకు దుమ్ము లేచి సమీపంలోని దుకాణం, ఇళ్లల్లోకి చేరుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయంగా మారిన రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. అదేవిధంగా మండలంలోని జూపల్లి నుంచి వంగూరు గేట్ వరకు ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు చెరువును తలపిస్తుంది. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి జూపల్లి నుంచి వంగూరు గేట్ వరకు బీటీ రోడ్డు వేయాలని జూపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.



కోడేరులో వరద ధాటికి కొట్టుకుపోయిన మట్టి రోడ్డు



చెరువును తలపిస్తున్న జూపల్లి నుంచి వంగూరు గేట్ మట్టి రోడ్డు

వర్షానికి కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

కోడేరు మండలంలోని ఖానాపూర్ వాగు ఇటీవల కురిసిన వర్షానికి తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు మొత్తం కొట్టుకుపోయి వాహనదారులు, ప్రజలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి గంట్రావుపల్లి సాతాపూర్ తదితర గ్రామాలకు వెళ్లాలంటే కనీసం ఎనిమిది నుంచి 10కిలో మీటర్లు తిరిగి రావాల్సి వస్తుందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ రైతులు ఈ వాగు దాటి తమ వ్యవసాయ పొలాలకు వెళ్లాలి. సుమారు 400ఎకరాల భూమి సాగు చేసుకోవడానికి ప్రతిరోజు వాగు దాటి పోవాల్సిందే. అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇవ్వడంతో పాటు ప్రతి ఎన్నికల్లో తమకు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరగా, ఎన్నికలు ముగిశాక పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి నుంచి ఖానాపూర్ మీదుగా కోడేరు వరకు రోడ్డుతో పాటు బ్రిడ్జి నిర్మాణానికి రూ.4కోట్లు మంజూరై, పనులు కూడా త్వరలో ప్రారంభిస్తారని అనుకున్నా.. ఇంత వరకు పనులు మొదలుపెట్టలేదు.

వాగులో కొట్టుకునిపోయి వ్యక్తి మృతి

రెండేళ్ల కింద వాగు దాటే క్రమంలో ఓ రైతు వరద ఉధృతికి కొట్టుకునిపోయి మృతి చెందాడు. ఇలా ప్రతి సంవత్సరం వాగు ఉధృతికి రైతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పొలాలకు వెళ్లి పంటలు సాగు చేస్తున్నారు.

పాలమూరు కరువుకు కాంగ్రెస్ పార్టీనే కారణం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, సెప్టెంబరు 25 : పాలమూరు కరువుకు కాంగ్రెస్ పార్టీనే కారణమని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రకటనలో విమర్శించారు. బుధవారం ఉమ్మడి పాలమూరు జిల్లాలో మంత్రుల ప్రాజెక్టుల సందర్శన నేపథ్యంలో స్పందించారు. పాడి పంటల పాలమూరును పడావు పెట్టి 14 లక్షల మంది ప్రజలను వలసల పాలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది కాదా అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి ఆంధ్ర, రాయలసీమ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసింది కాంగ్రెస్ కాదా అని నిలదీశారు. కల్వకుర్తి ఎత్తిపోతల కింద కనీసం నాలుగు టీఎంసీల రిజర్వాయర్‌లను కూడా నిర్మించకుండా ఆంధ్రాలో మాత్రం 400 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్‌లను నిర్మించింది నిజం కాదా అని ప్రశ్నించారు. ముందు చూపుతో పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయించిన ఘనత కేసీఆర్‌దే అని తెలిపారు. అసలు కాంగ్రెస్ పార్టీ నాయకులకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అన్న ఊహ అయినా మదిలో ఉందా అని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులను వందల కేసులు వేయించి అడ్డుకున్న పాపం ఆ పార్టీది అని మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల 57 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లు నిర్మించి పెట్టిన పది నెలలుగా పనులను నిలిపివేసి టెండర్లు రద్దు చేసిన పాపం ఈ ప్రభుత్వానిదని విమర్శించారు. ఇప్పుడు కృష్ణానది నుంచి ప్రతి రోజు 10 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతున్నా రిజర్వాయర్లు నింపుకోలేకపోవడానికి సోయి కూడా లేదని మండిపడ్డారు. ప్రభుత్వ పర్యవేక్షణ లేక వట్టెం పంపు హౌస్ మునిగి నెల కావస్తున్నా కనీసం నీళ్ల తోడడం లేదని ఇది రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కాదా అని నిలదీశారు. ఉదండాపూర్ నుంచి గ్రావిటీ ద్వారా కొడంగల్, నారాయణపేటకు సాగునీరు తరలించే అవకాశం ఉన్న కేవలం ముఖ్యమంత్రి రేవంత్ బేషజాలకు పోయి కొత్త ఎత్తిపోతల పథకం మొదలు పెట్టారని తెలిపారు. ఆరు టీఎంసీల సామర్థ్యం ఉన్న జూరాల మీద అదనపు భారం మోపుతున్నారని, అందుకే శ్రీశైలం బ్యాక్ వాటర్ కింద కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డిని మొదలు పెట్టారని గుర్తు చేశారు. బుధవారం చేసిన మంత్రుల పర్యటనతో పాలమూరుకు ఒరిగింది శూన్యమని, బీఆర్ఎస్ నాయకుల ప్రశ్నలకు భయపడి హడావిడిగా పర్యటన పెట్టుకున్నారని, ఇక్కడ రైతులకు మేలు చేయాలన్న ఒక ప్రణాళిక, చిత్త శుద్ధి ఈ ప్రభుత్వానికి లేదని తెలిపారు.

అక్షరానికి మరణం లేదు

- ఫ్లయింగ్ బర్డ్స్ పుస్తకావిష్కరణలో ప్రముఖ కవి అందెశ్రీ



ఫ్లయింగ్ బర్డ్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి అందెశ్రీ, ఉపాధ్యాయులు

పాన్‌గల్, సెప్టెంబరు 25 : ఎగిరే పక్షులు పాఠశాల పిల్లలు అని ప్రముఖ కవి అందెశ్రీ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఫ్లయింగ్ బర్డ్స్ విద్యార్థుల కవితా సంకలనం పుస్తక ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుస్తక సంపాదకుడు సి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల జీహెచ్ఎం నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చదువు లేకున్నా బాల్యంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. తెలంగాణ గీతంగా నేడు కొనసాగుతున్న జయ జయహే తెలంగాణ గీతం ప్రపంచ వ్యాప్తంగా మారుమోగడంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, రాష్ట్ర ప్రజల కృషి ఉందన్నారు. చదువు రాని వారు ఏదైనా తప్పు చేయడంలో వెనుకాడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్షరమే అమ్మ అని విద్యార్థులు అక్షరాలను ఆయుధాలుగా మార్చుకుంటే అదే సమాజంలో గుర్తింపు తెస్తుందన్నారు. ప్రతీ ఒక్కరిలో ప్రతిభ దాగి ఉంటుందని దాన్ని వెలికి తీస్తేనే గుర్తింపు కలుగుతుందన్నారు. అందుకు విద్యార్థులు పట్టుదలతో చదివి తమలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని సూచించారు. అంతకుముందు సావిత్రిబాయి పూలే, సరస్వతి మాత చిత్రపటాలకు పూజలు, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కవి జనజ్వాల, ఎంపీడీవో గోవిందరావు, ఎంపీవో రఘురాం, ఎంఈవో బి.శ్రీనివాసులు, హెచ్ఎం మంజుల, ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

చారకొండ, సెప్టెంబరు 25 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని మర్రిపల్లి బైపాస్ రోడ్డులోని వాగునుంచి మంగళవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పరును గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి సిబ్బందితో కలిసి టిప్పరును స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరదలో కొట్టుకుపోయిన మేకలు మృతి

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 25 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని వెన్నచెర్లలో దేవరపాగ లక్ష్మీకాంతంకు చెందిన మేకలు వరదనీటిలో కొట్టుకుపోయి మృతి చెందినట్లు బాధితుడు బుధవారం తెలిపారు. లక్ష్మీకాంతం తన మేకలను మేపడానికి పొలం వద్దకు తీసుకెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి వెన్నచెర్ల పెద్ద చెరువు వాగు ఉప్పొంగి ఉధృతంగా ప్రవహించింది. వాగు దాటుతున్న సమయంలో రెండు మేకలు కొటుకుపోయి మృతి చెందాయి. మృతి చెందిన మేకల విలువ రూ.30వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరాడు.

రేషన్ దుకాణంపై విచారణ

తిమ్మాజిపేట, సెప్టెంబరు 25 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచలో బుధవారం జిల్లా సివిల్ సప్లయి అధికారి శ్రీనివాసులు విచారణ చేపట్టారు. గతంలో దుకాణ డీలర్‌పై ఫిర్యాదు అందడంతో సివిల్ సప్లయి అధికారి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విచారించారు. డీలర్ చౌకధర దుకాణంలో అందుబాటులో ఉంటుందా? వినియోగదారులకు బియ్యం సక్రమంగా పంపిణీ చేస్తుందా? అనే అంశాలపై గ్రామంలో విచారణ జరిపారు. విచారణ అనంతరం నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు.

బీచుపల్లిలో సీబీఐ మాజీ జేడీ



పూజల్లో పాల్గొన్న మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ఎర్రవల్లి, సెప్టెంబర్ 24: జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లికి సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ బుధవారం కుటుంబ సభ్యులతో వచ్చారు.. తన సోదరి కనకదుర్గ నాలుగు రోజుల క్రితం మరణించడంతో ఆమె అస్థికలను కృష్ణానదిలో కలిపారు. పురోహితుడు అనిల్ శర్మ పూజలు చేశారు.

రోగులకు అందిన భోజనం



ఆసుపత్రిలో భోజనం చేస్తున్న రోగులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉప్పునుంతల, సెప్టెంబరు 25: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిలో భోజన ఏజెన్సీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై 21వ తేదీన 'రోగులకు అందని భోజనం' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై కాంట్రాక్టర్ స్పందించి బుధవారం రోగులకు భోజనం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి పలు గ్రామాల నుంచి వచ్చే రోగులకు వైద్యంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న భోజనం కల్పించినందుకు రోగులు ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

60 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వడ్డేపల్లి, సెప్టెంబరు 25 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్ కోవెలదిన్న రోడ్డు సమీపంలో ఉన్న భాస్కర్ పిండి గిర్నీలో 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. 40 క్వింటాళ్ల నూకలు, 20 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామన్నారు. నిర్వాహకుడు భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు

- పాలమూరు,రంగారెడ్డి, నార్లాపూర్ రిజర్వాయర్‌ను సందర్శించిన మంత్రులు ఉత్తమ్, జూపల్లి



నార్లాపూర్ రిజర్వాయర్‌ను సందర్శించిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు చిత్రంలో చిన్నారెడ్డి, మల్లురవి, వంశీకృష్ణ

కొల్లాపూర్, సెప్టెంబరు 25 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాతోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి వలసల జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుదలతో ఉందని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు రాష్ట్ర ఇరిగేషన్ ఉన్నతాధికారులు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నార్లాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు.

వారు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు జీరో పాయింట్, అప్రోచ్ కెనాల్, సర్జ్‌పూల్‌తో పాటు పాలమూరు రంగారెడ్డి మెయిన్ కెనాల్‌ను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు ఉన్నతాధికారులతో సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి అధికారులతో రివ్యూ నిర్వహించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగారెడ్డి, ఎంజీఎల్ఐ, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్, గట్టు లిఫ్టు ఇరిగేషన్ వీటన్నింటినీ వేగవంతంగా పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుదలతో, ఉందని అందులో భాగంగానే పెండింగ్ ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం చేపట్టామన్నారు. అంతకు ముందు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో భూమిని కోల్పోయిన నిర్వాసితులు తమకు ఆర్‌అండ్‌ఆర్ పథకం కింద జీవో 123 ప్రకారం నిర్వాసితుల పరిహారం ఇవ్వాలని మంత్రులు ఉత్తమ్, జూపల్లి దృష్టికి తీసుకెళ్లారు. నిర్వాసితుల సమస్యలను సానుకూలంగా విన్నమంత్రులు వాటిని పరిశీలిస్తామని వారికి భరోసా కల్పించారు. హెలికాప్టర్ ద్వారా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును సందర్శించిన మంత్రులకు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, స్థానిక కాంగ్రెస్ నేతలు శాలువా, పూల మాలలతో స్వాగతం పలికారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తిమ్మాజిపేట, సెప్టెంబరు 25 : ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి మౌనిక అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఆవరణలో బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పలు రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదవాలని మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, మానసికంగా ఎదగాలని, దృఢంగా ఉండాలని, ఏకాగ్రతతో చదివి క్రమశిక్షణ అలవాటు చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. శ్రద్ధగా చదివి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు చదువు నేర్పిన ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. న్యాయవాదులు శ్యాంప్రసాద్‌రావు, రామచందర్, భవానిబాయ్, శ్రీరామ్, ఆర్య, ఖాజా, అబ్దుల్ రహీం, జీహెచ్ఎం సత్యనారాయణశెట్టి, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, సిబ్బంది రాజు, కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయండి

- డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 25: దేశ వ్యాప్తంగా ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయడంతో పాటు రాష్ట్ర అసెంబ్లీలో జనాభా ప్రతిపాదికన బడ్జెట్‌ను కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి డిమాండ్ చేశారు. బుధవారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా బండి లక్ష్మీపతి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం దళితులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను కల్పించాలని డిమాండ్ చేశారు. డీహెచ్‌పీఎస్ నాయకులు చిన్నపాగ శ్రీనివాసులు, బండి శ్రీను, బాబా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారి బాధ్యతలు స్వీకరణ

బిజినేపల్లి, సెప్టెంబరు 25 : మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి బుధవారం బిజినేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు లేనందున్న గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నదని సంబంధిత అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కతలప్ప గౌడ్, ఎంపీవో నరసింహులు, సిబ్బంది మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్న జిల్లా సంక్షేమశాఖ అధికారి రాజేశ్వరిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఇంతకు ముందు మండల ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించిన జిల్లా భూగర్భ జల శాఖ అధికారి రమాదేవి పదోన్నతితో బదిలీపై వెళ్లినట్లు ఎంపీడీవో తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి, జూనియర్ అసిస్టెంట్ సుధీర్, టైపిస్ట్ కల్పన, పంచాయతీ కార్యదర్శులు లింగారెడ్డి, శ్రీదేవి, అశోక్ తదితరుల ఉన్నారు.

ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ జీవోను సవరించాలి

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 25: ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ జీవోను సవరించాలని బహుజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల వెంకటేష్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంపై చర్చించినట్లు తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్మెంట్ జీవో అనేది క్షేత్ర స్థాయిలోని అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా అశాస్త్రీయమైన బహుళ తరగతి బోధన చేసేలా ఉందన్నారు. 10 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు 11 నుంచి 60 విద్యార్థులు ఉంటే ఇద్దరూ ఉపాధ్యాయులు 90 వరకు విద్యార్థులు ఉంటే ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాలన్నారు. ఉపాధ్యాయులు రవీందర్, నాయకులు శ్రీనివాసులు, భూపతి కుమార్, రంజిత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఆశయాలను కొనసాగిద్దాం



దీన్‌దయాళ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి, సెప్టెంబరు 25 : పండిట్ దీన్‌దయాళ్ ఆశయాలను కొనసాగిద్దామని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దీన్‌దయాళ్ త్యాగాలు వెలకట్టలేనివని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు రాఘవేందర్‌గౌడ్, రాంభూపాల్‌రెడ్డి, నరసింహ, శేఖర్‌రెడ్డి, రవి గౌడ్, వివేకానంద, బాబీదేవ్ తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు ఉద్యమంలా సాగాలి

- బీజేపీ రాష్ట అధికార ప్రతినిధి కట్ట సుధాకర్

వంగూరు, సెప్టెంబరు 25: పార్టీ సభ్యత్వ నమోదు ఉద్యమంలా సాగాలని, లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రతీ నాయకుడు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట అధికార ప్రతినిధి కట్ట సుధాకర్ అన్నారు. బుధవారం వంగూరులోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి కొప్పు బాషతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో బీజేపీకి రాజకీయ ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయన్నారు. దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తూ దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే విధంగా మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటేందుకు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్లమెంట్ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి సైదులు, శ్రీనునాయక్, నాగరాజు, ఆనందురెడ్డి, సైదులు, భాస్కర్, పరమేష్‌యాదవ్, నవీన్‌రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలి

- జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు

మన్ననూర్, సెప్టెంబరు 25: గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకొని వ్యాపారాలు చేసుకుంటున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్ రావుకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

గ్రామ పంచాయతీ కార్యాలయ సర్వేకు వచ్చినటువంటి అధికారిని కలిసిన గ్రామస్థులు పలు సమస్యలను విన్నవించారు. గ్రామంలో వ్యవసాయ భూములను గతంలో అనుమతులు లేకుండా నాలా నక్వర్షన్ చేయించుకొని హోటళ్లు, వ్యాపార సంస్థల నిర్మాణాలను చేపట్టారని తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల స్థలంలో శ్రీశైలం-హైదరాబాద్ రహదారి పక్కన అక్రమంగా పలువురు డబ్బాలను నిర్మించుకుని వాడుకుంటున్నారన్నారు.

అట్టి వాటిని తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారికి విన్నపించగా, విచారణ చేపట్టాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి భీముడు నాయక్‌ను కోరారు. మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు రహీం, కాంగ్రెస్ నాయకులు తుల్యా, శంకరయ్య జూలూరి సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, రాజారాం పాల్గొన్నారు.



జిల్లా పంచాయతీ అధికారికి వినతి పత్రాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

ఎస్సీ వర్గీకరణలో బేడబుడగ జంగాలకు సముచిత స్థానం కల్పించాలి

- బేడబుడగ జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్యం

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 25 : ఎస్సీ వర్గీకరణలో బేడబుడగ జంగాలకు సముచిత స్థానం కల్పించాలని బీజేహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్యం, జాతీయ అధ్యక్షుడు కోడిగంటి నరసింహులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో బేడబుడగ జంగాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీదిగొండ ఏతిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారంగా వచ్చే రిజర్వేషన్లు, హక్కులు నేటికీ అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ ఫలాలు అందక ప్రభుత్వ ఆదరణ కరువై ఎలాంటి ప్రాతినిధ్యం లభించడం లేదని వారన్నారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని 30 సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన వర్గీకరణ ఉద్యమంలో బేడబుడగ జంగాలు అనేక పోరాటాలు నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బేడబుడగ జంగాలకు సముచిత స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

● మండల నూతన కమిటీ ఏర్పాటు

పెద్దకొత్తపల్లి మండల బేడబుడగ జంగాల మండల నూతన కమిటీని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్యం, జాతీయ అధ్యక్షుడు కోడిగంటి నరసింహ, రాష్ట్ర అధ్యక్షుడు ఎడవల్లి వీరప్ప, గౌరవ అధ్యక్షుడు మీదిగొండ కృష్ణయ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం మల్లికార్జున్, దేవరాజ్‌ల ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా గడ్డం సుభాష్, మండల యూత్ అధ్యక్షుడుగా గడ్డం సహదేవుడు, కోశాధికారిగా కుమార్, ఉపాధ్యక్షుడిగా మహేష్, కృష్ణంరాజు, చిరంజీవి, జిల్లా నాయకులు నరహరి, గౌరవ సలహాదారుగా శివలింగం, సభ్యులుగా రాములు, మహేష్, నాగరాజు, మన్నమ్మ, సాలమ్మ, భాస్కర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సంఘీభావం తెలుపుతున్న బేడబుడగ సంఘం నాయకులు

ఫార్మాసిస్టుల సేవలు విలువైనవి

- వైద్యారోగ్య శాఖ జిల్లా అధికారి స్వరాజ్యలక్ష్మి

కందనూలు, సెప్టెంబరు 25 : రోగుల ఆరోగ్యం మెరుగుపర్చడంలో ఫార్మాసిస్టుల సేవలు విలువైనవని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాలకు హాజరైన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఫార్మాసిస్టుల సేవలను కొనియాడుతూ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఫార్మాసిస్టు కీలక వ్యక్తులు, వైద్యారోగ్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. మందుల తయారీ నుంచి వాటి నాణ్యత ప్రమాణాలను పర్యవేక్షించేందుకు వ్యాధిగ్రస్థులకు మంచిమందులు వినియోగం పట్ల తగు సూచనలు, సలహాలు ఇవ్వడం వాటి దుష్ఫలితాల పట్ల అవగాహన కల్పించడంలో ఫార్మాసిస్టుల పాత్ర ఎనలేనిదన్నారు. అనంతరం ఫార్మాసిస్టుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి ఫార్మాసిస్టులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ వెంకటదాస్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రవికుమార్‌నాయక్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కృష్ణమోహన్, ప్రభుత్వ ఫార్మాసిస్టుల సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్, శ్రీనివాసులు, వెంకటేష్, బాలరాజు, కుమార్, కుమారచారి, జిల్లాలోని ఫార్మాసిస్టులు హాజరయ్యారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ స్వరాజ్యలక్ష్మి

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

- జిల్లా న్యాయాధికారి డి.రాజేష్‌బాబు

కల్వకుర్తి, సెప్టెంబరు 25 : ఈ నెల 28న జరగబోయే మెగాలోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయాధికారి డి.రాజేష్‌బాబు కోరారు. కల్వకుర్తి పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 28న జరగబోయే మెగా లోక్ అదాలత్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో లోక్ అదాలత్‌లను విజయవంతం చేయడంలో జిల్లా ముఖ్యస్థానం వహించిందన్నారు. అందులో కల్వకుర్తి కోర్టు నుంచి ఎక్కువ కేసులు పరిష్కరించడంలో న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీసుల పాత్రను అభినందించారు. ఈనెల 28న జరగబోయే మెగా లోక్ అదాలత్‌కు కూడా ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషి చేయాలని ఆయన కోరారు. జూనియర్ సివిల్, జూనియర్ సీనియర్ కోర్టులో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, ఎంసీ, డీవీసీ, హెచ్ఎంవోపీ వంటి కేసులలో ఎక్కువ పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. రాజీపడడం వలన డబ్బు సమయం ఆదా కావడమే కాకుండా కక్షిదారులకు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జిల్లాలో ఆరు మెగా లోక్‌అదాలత్ జరిగాయని, అందులో ఒకటవ లోక్ అదాలత్ 2000 కేసులు, రెండవ లోక్ అదాలత్‌లో 3000, మూడవ లోక్‌అదాలత్‌లో 6000, నాల్గవ లోక్ అదాలత్‌లో 13000, ఐదవ లోక్ అదాలత్‌లో 15000కేసులు పరిష్కరించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. అదే స్ఫూర్తితో 6వ మెగా లోక్‌అదాలత్ 18వేల కేసు లు పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా కోర్టు ఆవరణను శుభ్రపర్చారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి, జూనియర్ సివిల్ న్యాయాధికారి కావ్య, కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ బి.నాగార్జున, కల్వకుర్తి బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు, కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి రమేష్‌బాబు

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలి

బిజినేపల్లి, సెప్టెంబరు 25 : 61 సంవత్సరాలు పూర్తి అవుతున్నా వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని బిజినేపల్లి తహసీల్దార్ కార్యాయంలోని తహసీల్దార్ జనుంపల్లి శ్రీరాములుకు బుధవారం వీఆర్ ఏలు వినతిపత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం 81, 85 జీవోల ప్రకారం వీఆర్ఏలను రెగ్యులర్ చేసి ఉద్యోగాలు ఇచ్చిందని అన్నారు. మిగిలిన 61 సం వత్సరాలు దాటిన వీఆర్ఏల కుటుంబాలకు మాత్రం ఇప్పటి వరకు ఉద్యోగాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఉద్యోగాలు కల్పించేలా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌రు కోరారు.

● ఉప్పునుంతల: 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు త్వరితగతిన ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమీలకు వీఆర్ఏలు సతీష్, చందు వినతి పత్రం అందచేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 3797 మంది 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ వారసులకు నియామకం ఉత్తర్వులు ఇవ్వనం దున కుటుంబాలు ఆర్థిక పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

అదృశ్యమైన వ్యక్తిని గుర్తించిన పోలీసులు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 25 : వ్యక్తి డప్పుల కురుమూర్తి అదృశ్యమైన సంఘటనపై పోలీసులు గంటల వ్యవధిలోనే గుర్తించినట్లు ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూర్‌కు చెందిన డప్పుల కురుమూర్తి బుధవారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు కురుమూర్తి సోదరుడు వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలో నాగర్‌కర్నూల్ పోలీసులు గంటల వ్యవధిలోనే మన్ననూర్ సమీపంలో గుర్తించి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 25 : నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామానికి చెందిన దాసరి శ్రీలేఖ(21) అదృశ్యమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. తూడుకుర్తి గ్రామానికి చెందిన శ్రీలేఖ మంగళవారం రాత్రి అందరూ నిద్రపోయాక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. తల్లి రేణుక తెల్లవారుజామున 3గంటలకు లేచి చూడగా శ్రీలేఖ కన్పించలేదు. ఇటీవల వీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన యువకునితో శ్రీలేఖకు నిశ్చితార్థం అయింది. శ్రీలేఖ అదృశ్యంపై గ్రామానికి చెందిన శివ అనే యువకునిపై అనుమానం ఉన్నట్లు శ్రీలేఖ తల్లి రేణుక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య వేధింపుల వల్లే భర్త సాయిబాబు ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 25 : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని శ్రీపురం రోడ్డులో గల బీసీ కాలనీకి చెందిన పూసల సాయిబాబు(26) భార్య వేధింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని బావ శేఖర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. పూసల సాయిబాబుకు నెల రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన నందినితో వివాహమైంది. వేధింపుల వల్లే ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం ఫ్యాన్‌కు ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు శేఖర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 25 : మద్యం తాగి వాహనం నడిపిన మహేష్ అనే వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు 500 జరిమానా విధిస్తూ జిల్లా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి వి.రామయ్య బుధవారం ఉత్తర్వులు వెలువరించినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాల ప్రకారం.. గత కొన్ని నెలల క్రితం మద్యం తాగి వాహనం నడపడంతో పోలీసులు వాహనాల తనిఖీ సమయంలో పట్టుబడిన మహేష్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 25: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, కంప్యూటర్ రూంలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి, విధులకు సంబంధించిన పలు సూచనలు చేశారు. ప్రధానంగా ఉన్న సమస్యలను ఎస్సైలు రాము, ఇందిరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సైలు ఎప్పటికప్పుడు ఎల్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం బాధితుల ఫిర్యాదులపై సత్వరం స్పందించి వారికి సేవలందించాలన్నారు. పట్టణంలో దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలను చైతన్యపరిచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు.

విద్యార్థి గర్జన సభను జయప్రదం చేయండి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 25: విద్యారంగ సమస్యలపై ఈ నెల 27న హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన విద్యార్థి గర్జన సభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్, జిల్లా అధ్యక్షుడు ఎండీ.సయ్యద్, కార్యదర్శి ఎం.తారాసింగ్, నాయకులు కార్తీక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన మంచినీటిని సరఫరా చేయాలి

అమ్రాబాద్, సెప్టెంబరు 25: గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు శుభ్రమైన మంచినీరు అందించాలని జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్ రావు అన్నారు. అమ్రాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో జల్ జీవన్ మిషన్ ద్వారా నల్ జల్ మిత్రలకు రెండవ రోజు బుధవారం నిర్వహించిన శిక్షణ శిబిరానికి డీపీవో రామ్మోహన్ రావు హాజరై మాట్లాడారు. గ్రామాల్లో మోటార్లు, పైప్‌లైన్ పర్యవేక్షణ నిర్వహించి స్వచ్ఛమైన మంచినీరు అందించి ప్రజలకు సహకరించాలని డీపీవో సూచించారు. అచ్చంపేట డీఎల్పీవో వెంకటప్రసాద్, అమ్రాబాద్ ఎంపీడీవో వెంకటయ్య, మిషన్ భగీరథ ఏఈ సందీప్, పంచాయతీ కార్యదర్శి మల్లేష్ తదితరులు ఉన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు

చారకొండ, సెప్టెంబరు 25: స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారిని డాక్టర్ మంజుబార్గవి మల్టీపర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం చారకొండలో రోడ్డుపక్కల ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఎంపీవో వెంకటేష్, సీహెచ్‌వో శేఖర్‌రెడ్డి, హెచ్ఈవో ఎస్డీచారి, పంచాయతీ కార్యదర్శులు గణేష్, రవిశంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాధమ్మ, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

లింగాల, సెప్టెంబరు 25: గ్రామీణ కుటుంబాలకు తాగునీటికి ప్రధాన వనరుగా ఆధారపడి ఉన్న చేతిపంపుల మరమ్మతులో నైపుణ్యాన్ని సాధించడానికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడుతాయని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. మిషన్ భగీరథ శాఖ ద్వారా గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ శిబిరంలో బుధవారం రెండవ రోజు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బలరాంనాయక్ పర్యవేక్షణలో చేతిపంపుల వాడకం మరమ్మతులపై అవగాహన కల్పించారు. జిల్లా మాస్టర్ ట్రైనర్ చేతిపంపుల మరమ్మతులు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బలరాంనాయక్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఉప్పునుంతల, సెప్టెంబరు 25: పౌష్టికాహారంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో దమయంతి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో మండల లెవల్ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ బేబి షో, కిషోర బాలికలకు వెల్ బేబి షోలో పాల్గొన్న పిల్లలకు ఆమె బహుమతులు అందచేశారు. ఎంపీడీవో మోహన్‌లాల్, సూపర్‌వైజర్ ప్రభావతి, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ పార్వతి తదితరులు ఉన్నారు.

ధూమపానంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



దూమపానం, మద్యపానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రశాంతి

బల్మూరు, సెప్టెంబరు 25 : ధూమపానంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారిణి ప్రశాంతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ధూమపానం, మద్యపానంపై ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడుబారిన పడకుండా విద్యపై దృష్టి సారించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ధూమపానం, మద్యపానం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు పూర్తిస్థాయిలో వివరించారు. సీహెచ్‌వో విజయమ్మ, సూపర్‌వైజర్ ఉమాదేవి, వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ కుర్ర హాథీరామ్, ఏఎన్ఎంలు పద్మ, సుజాతమ్మ, తిరుపతమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

అమ్రాబాద్, సెప్టెంబరు 25: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్క విద్యార్థి సంపూర్ణమైన అవగాహన కల్పించుకొని కృషి చేయాలని అమ్రాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ అన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన పర్యావరణ అవగాహన సదస్సుకు అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం ఎడ్యుకేషనల్ అధికారి శ్వేత హాజరై విద్యార్థులకు పలు విషయాలపైన అవగాహన కల్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల విద్యాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 25 : పెద్దకొత్తపల్లి మండల విద్యాధికారిగా కే శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో వెల్దండ మండల ఎంఈవో చంద్రుడు పెద్దకొత్తపల్లి ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగారు. శ్రీనివాస్‌రెడ్డి పెద్దకొత్తపల్లి మండల ఎంఈవోగా పదవీ బాధ్యతలు చేపట్టారు. టీఎస్‌పీఆర్‌టీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో పూల మాల, శాలువాలతో ఆయనను ఘనంగా సన్మానించారు. పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు బాబురావు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, పరమేష్, సాయిప్రకాశ్‌రెడ్డి, శివుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, మహంకాళి, ప్రకాశ్, సుదర్శన్, శివశంకర్, ఎమ్మార్సీ సిబ్బంది శివలింగం, జయప్రకాశ్, స్వామి, ఈశ్వర్ పాల్గొన్నారు.

తిమ్మాజిపేట విద్యాధికారిగా సత్యనారాయణ

తిమ్మాజిపేట : మండలం విద్యాశాఖ అధికారిగా సత్యనారాయణశెట్టి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇన్‌చార్జి ఎంఈవోగా చేసిన భాస్కర్‌రెడ్డి నాగర్‌కర్నూల్‌కు పరిమితం చేశారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ జీహెచ్ఎంగా పని చేస్తున్న సత్యనారాయణ శెట్టికి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ తెలంగాణ మండల అధ్యక్ష కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, శేఖర్, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు అమరసింహారెడ్డి, గౌరవసలహాదారులు అశోక్, శివరామకృష్ణగౌడ్, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు నసీర్, శ్రీనివాసులు, రాధాకృష్ణ ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణశెట్టిని శాలువాలు కప్పి సన్మానించారు.

'మాదక ద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించాలి'

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 25 : సమాజంలో ప్రతీ ఒక్కరు మాదక ద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించాలని నాగర్ కర్నూల్ జిల్లా స్వేరోస్ ప్రతినిధి బొల్లె రమేష్ అన్నారు. మహాత్మాగాంధీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్ర మైన పెద్దకొత్తపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్వేరోస్ ఆధ్వ ర్యంలో సమాజంలో మాదక ద్రవ్యాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటి నివారణ చర్యల గురించి అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. జిల్లా స్వేరోస్ జాయింట్ కార్యదర్శి మబ్బురాం, భాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం

కోడేరు, సెప్టెంబరు 25 : పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బి.రామచంద్రరావును పీఆర్‌టీయూటీఎస్ ఉపాధ్యాయ సంఘం కోడేరు మండల అధ్యక్షుడు అర్జున్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. బుధవారం కోడేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన రామచంద్రరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అర్జున్‌గౌడ్ మాట్లాడుతూ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందున సంతోషంగా ఉందన్నారు. పీఆర్‌టీయూటీఎస్ కార్యదర్శులు సుబ్బయ్య, మునీశ్వర్, ఉపాధ్యాయులు నారాయణ ఉన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పెంట్లవెల్లి, సెప్టెంబరు 25: పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఉన్న 14 ఎకరాల 36గుంటల భూమిని 16 సంవత్సరాల క్రితమే ఇళ్ల స్థలాల కోసం కేటాయించారు. అట్టి భూమిని ఇళ్లు లేని పేదలందరిని గుర్తించి వారికి పంపిణీ చేయాలని వారు కోరారు. సీపీఎం మండల నాయకులు శ్రీనివాసులు, తిమ్మస్వామి, రాజు, ఆదిలక్ష్మి, రాంచంద్రయ్య గుండమ్మ పాల్గొన్నారు.

'సగరులను బీసీ-ఏలోకి మార్చాలి'

కల్వకుర్తి, సెప్టెంబరు 25: సగరులను బీసీ-డీ నుంచి బీసీఏలోకి మార్చాలని సగర సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వివేకానంద డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని సగర యువజన రాజకీయ చైతన్య సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించడానికి పాలక ప్రభుత్వం సహకరించాలని కోరారు. నాయకులు రాజు, ఆంజనేయులు, వెంకటయ్య, బాబు, భీమయ్య, వేణు, దుర్గయ్య ఉన్నారు.

ప్లాట్ల పత్రాలు అందజేయాలి

చారకొండ, సెప్టెంబరు 25: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సంబంధిత ప్లాట్లకు సంబంధించి 2020 సంవత్సరంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు సంబంధిత ప్లాట్ల డ్యాక్యుమెంట్, ఈసీ, లేఅవుట్ పత్రాలను మూడు రోజుల్లో అందించాలని పంచాయతీ కార్యదర్శి గణేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

సీపీఎం ఏరియా సభలను జయప్రదం చేయండి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 25: వచ్చే నెల 5,6 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన సీపీఎం నాగర్‌కర్నూల్ ఏరియా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందికొండ గీత పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాయంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సీపీఎం నాయకులు అశోక్, రామయ్య సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.